సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 1 । జూన్ । 2023



రైతుల సంక్షేమానికి పెద్దపీట

రాయితీపై పంపిణీ చేస్తున్న విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి కోరారు. 8లో



భారీగా గంజాయి పట్టివేత

ఒడిశాకు తరలిస్తున్న గంజాయిని లబ్బూరు జంక్షన్ వద్ద ముంచంగిపుట్టు పోలీసులు పట్టుకున్నారు. 8లో



కలెక్టర్ దృష్టికి సమస్యలు

రంపచోడవరం మండలంలో సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ బంధం శ్రీదేవి కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కోరారు. 8లో

కాఫీ రైతుకు.. కాసుల వర్షం

కాఫీ సాగు రైతులకు ఈ ఏడాది కాసుల వర్షం కురిపించనుంది. వరుణ కటాక్షం తోడవడంతో ముందుగానే పూత వచ్చింది. పిందె కూడా గతేడాది కన్నా ఆశాజనకంగా ఉన్నందున దిగుబడి కూడా పెరిగే అవకాశం ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నందున ధర కూడా గిరి రైతుకు కలిసొచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

- కరుణించిన ప్రకృతి
- మార్చి నుంచి వరుణ కటాక్షం
- ముందస్తుగా పూత, పిందె
- గతేడాది కన్నా మరింత దిగుబడి పెరిగే అవకాశం
- ఫలసాయంతో తోటలు కళకళ

కాఫీ సాగు వివరాలు

మండలం	రైతులు	సాగు (ఎకరాల్లో)
జి.మాడుగుల	33,688	34.384
చింతపల్లి	31,194	33.348.50
పాడేరు	22,048	22,424
హుకుంపేట	19,281	19,705.50
డుంబ్రిగుడ	16,858	15,926
పెదబయలు	15,094	14,819
ముంచంగిపుట్టు	13,699	11,050.50
అరకులోయ	13,287	13.479
అనంతగిరి	11,687	12,657.50
కొయ్యూరు	6,418	10,627



పాడేరు ప్రాంతంలో ఏప్రిల్‌లో వికసించిన కాఫీ పూలు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని కాఫీ తోటలకు వాతావరణ పరిస్థితులు అనుకూలించాయి. ఈ ఏడాది ముందుగానే రైతులకు ఫలసాయం అందే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మార్చి నుంచి వర్షాలు కురవడంతో పూత కూడా ముందే వచ్చింది. మే నెలలో రావాల్సిన పూత ఏప్రిల్‌లోనే విరబూసింది. వర్షాలు కురుస్తుండటం పూత దశలో కూడా ఉపయోగపడింది. ప్రస్తుతం పిందెతో తోటలు కళకళలాడుతున్నాయి. దీనివల్ల ఈఏడాది దిగుబడి గణనీయంగా పెరుగుతుందని కేంద్ర కాఫీ బోర్డుతోపాటు,



జి.మాడుగుల మండలం రచ్చపల్లి ప్రాంతంలో విరగ్గాసిన కాపు

పాడేరు ఐటీడీఏ కాఫీ విభాగం అధికారులు అంచనా వేస్తున్నారు.

జీవనాధార పంటగా..

పాడేరు డివిజన్‌లో అధిక శాతం రైతులకు కాఫీ సాగు జీవనాధారం. ఈ ప్రాంతంలో సేంద్రియ విధానంలో పండించడం వల్ల మన్యం కాఫీకి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. ఏజెన్సీలోని 11 మండలాల పరిధిలో 2,27,021ఎకరాల విస్తీర్ణంలో కాఫీ తోటలు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో 2,18,393 మంది రైతులు సాగు చేస్తున్నారు. సుమారు 1,42,515 ఎకరాల్లో తోటలు ఫలసాయం ఇస్తున్నాయి. గతేడాది 14వేల మెట్రిక్ టన్నుల క్లీన్ కాఫీ గింజలను గిరిజన రైతులు విక్రయించారు. ధర కూడా ఆశాజనకంగా ఉన్నందున లాభాలు పొందారు. ఈ ఏడాది పూత, పిందె ఆశాజనకంగా ఉన్నందున 16 వేల మెట్రిక్ టన్నులకు దిగుబడి పెరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

నాణ్యమైన దిగుబడికి అవకాశం



ఐదు ఎకరాల్లో కాఫీ సాగు చేస్తున్నా. గతేడా దిగుబడి, ధర పెరగడంతో మంచి ఆదాయం వచ్చింది. గతేడాది కన్నా ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున దిగుబడి పెరిగే అవకాశం ఉంది. వర్షాలు పుష్కలంగా కురవడంతో దిగుబడి, నాణ్యత బాగుంటుంది. మార్కెట్‌లో మంచి ధర లభించే అవకాశం ఉంటుంది. – **తరడా రాజంనాయుడు,** ఎర్రగుప్ప, పాడేరు మండలం

దిగుబడి బాగా పెరగొచ్చు



వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో కాఫీ తోటలు పిందెతో కళకళలాడుతున్నాయి. గతేడాది ఎకరాకు 500 కిలోల వరకు ఫలసాయం రాగా ఈ ఏడాది 650 కిలోలు వచ్చే అవకాశం ఉంది.మొత్తం మీద 16వేల మెట్రిక్ టన్నుల కాఫీ గింజలను గిరిజన రైతులు విక్రయించే అవకాశం కనిపిస్తోంది.

– **అశోక్**, కాఫీ ఏడీ, పాడేరు ఐటీడీఏ

పారదర్శకంగా ఆస్తిపన్ను మదింపు : డీఎల్పీవో



మాట్లాడుతున్న డీఎల్పీవో కుమార్

చింతపల్లి: పారదర్శకంగా ఆస్తి పన్ను మదింపు చేయాలని డీఎల్పీవో కుమార్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన జీకేవీధి,చింతపల్లి పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో గత రెండు దశాబ్దాలుగా ఇంటి పన్ను రివిజన్ జరగకపోవడంతో, అన్ని నిర్మాణాలు పన్ను పరిధిలోకి రానుందున పంచాయతీలు ఆర్థికంగా నష్టపోతున్నాయన్నారు. కార్యదర్శులు విధిగా గ్రామాలను సందర్శించి అన్ని నిర్మాణాలను పరిశీలించి వాటి పాత,నూతన కొలతలు ఆధారంగా ఆస్తి పన్నులో వ్యత్యాసాన్ని సరిచేసి మదింపు చేయాలని ఆయన కోరారు. ఈ ప్రక్రియను జూన్ 15 లోగా పూర్తి చేయాలని కార్యదర్శులు ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీలు శ్రీనివాస్, పాపారావు, పాల్గొన్నారు.

జీసీసీ డీఎంపై సస్పెన్షన్ ఎత్తివేత

సాక్షి,పాడేరు: జీసీసీ పాడేరు డీఎం కురుసా పార్వతమ్మపై సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ జీసీసీ ఎండీ సురేష్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాఫీ కొనుగోళ్లకు సంబంధించి అక్రమాలు జరిగాయని విజిలెన్స్ కమిటీ నివేదిక మేరకు ఆమెను నాలుగు రోజుల క్రితం ఆయన సస్పెండ్ చేశారు. అయితే బుధవారం పార్వతమ్మ పదవీవిరమణ పొందనుండటంతో ఆమెపై సస్పెన్షన్‌ను ఎత్తివేశారు.

వైఎస్సార్ రైతు భరోసా నేడు విడుదల

- జిల్లాలో 1,69,264 మందికి చేకూరనున్న లబ్ధి
- జిల్లా వ్యవసాయాధికారి నందు

సాక్షి,పాడేరు: వైఎస్సార్ రైతు భరోసా పథకం 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రోత్సాహక సొమ్మును ప్రభుత్వం గురువారం విడుదల చేయనుందని జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నందు ఒక ప్రకటనలో తెలిపారు. అన్నదాతలకు తొలి విడత పెట్టుబడి సాయం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతు భరోసా–పీఎం కిసాన్ పథకంలో అర్హులైన రైతులకు ఏటా మూడువిడతల్లో రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం ప్రభుత్వం అందిస్తోందన్నారు. మే లేదా జూన్‌లో రూ.7.500, రెండో విడతగా అక్టోబర్‌లో రూ.4వేలు, మూడోవిడతగా జనవరిలో రూ.2 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ అవుతోందన్నారు. జిల్లాలో ఈ ఏడాదితో కలిపి గత నాలుగేళ్లలో 1,69,264 మందికి వైఎస్సార్ రైతుభరోసా–పీఎం కిసాన్ పథకంలో రూ.993.68 కోట్ల పెట్టుబడి సాయం అందిందన్నారు. జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వైఎస్సార్ రైతు భరోసా– పీఎం కిసాన్ పథకంలో 1,12,123 మంది భూమి యజమానులకు రూ.84.09 కోట్లు, 56,973 మంది అటవీ భూమి సాగుదారులకు రూ.42.79 కోట్లు, 168 మంది కౌలు రైతులకు రూ.126 లక్షలు, మొత్తం రూ. 1,69,264 మంది రైతులకు రూ.126.94 కోట్ల తొలివిడత పెట్టుబడి సాయాన్ని గురువారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో జమచేస్తారన్నారు. దీనిలో భాగంగా పాడేరు కాఫీ హౌస్‌లో పెట్టుబడి సాయం పంపిణీ కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

వైఎస్సార్ యంత్రసేవా పథకం..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ యంత్ర సేవా పథకం(మెగా మేళా) గుంటూరు జిల్లాలో ప్రారంభిస్తున్నారని జిల్లా వ్యవసాయాధికారి నందు పేర్కొన్నారు. రైతులకు వ్యవసాయ పరికరాలను అద్దె ప్రాతిపదికను అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లాలో వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో ట్రాక్టర్లు, పవర్ టిల్లర్స్, పవర్ వీడర్స్, స్ప్రేయర్స్, నూర్పిడి యంత్రం, బ్రష్ కట్టర్స్, నాగలి తదితర యంత్ర పరికరాలను 40 శాతం రాయితీపై సరఫరాకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. జిల్లలో 95 గ్రూపులకు రూ.1.40 కోట్ల రాయితీపై యంత్ర పరికరాలను వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందిస్తామన్నారు. దీనిలో భాగంగా 32 ట్రాక్టర్లు, 57 పవర్ వీడర్స్, 4 పవర్ టిల్లర్స్, 10 బ్రష్ కట్టర్స్, 11 స్ప్రేయర్, మొత్తం 214 యంత్ర పరికరాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం మెగా మేళాను ఈనెల 2వతేదీన పాడేరు, కాఫీ హౌస్‌లో నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

సచివాలయ వ్యవస్థతో అవినీతి రహిత పాలన

పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లి రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయాల వ్యవస్థతో అవినీతి రహిత పాలన సాధ్యమైందని పాడేరు ఎమ్మెల్యే కొట్టిగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని పెదబరడ, అన్నవరంలో గ్రామసచివాలయ భవనాలు, చిన్నగడ్డలో హెల్త్‌క్లినిక్ సెంటర్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. ప్రజల వద్దకు పాలన తీసుకువచ్చి గ్రామ స్వరాజ్యం సాధించాలన్న గాంధీజీ ఆశయం జగనన్న ఆలోచనతో సాధ్యమైందన్నారు. సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని, పలు రాష్ట్రాలు ఈ వ్యవస్థను ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నాయన్నారు. ప్రతి పనికి వందల రూపాయలు ఖర్చు చేసుకుని మండల కేంద్రాలకు వెళ్లే ప్రజలు ఇప్పుడు ఇళ్ల వద్ద ఉండి వలంటీర్ల ద్వారా సులభంగా సేవలు పొందుతున్నారన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం , మూడు సార్లు ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత



చిన్నగడ్డలో హెల్త్ క్లినిక్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చంద్రబాబు ప్రజలకు గుర్తుండి పోయే ఒక్క పని చేయాలన్న ఆలోచన రాకపోవడం రాష్ట్ర ప్రజల దురదృష్టమన్నారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు ప్రజలకు వరమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, పీఆర్ డీఈ నరేన్‌కుమార్, పెదబరడ సర్పంచ్ సమిడి గోపాల్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు దురియా పుష్పలత, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి, ఎంపీటీసీలు దాసరి దారలక్ష్మి, పొట్టిక లోవరాజు, కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జెన్‌కో అంబులెన్స్ సిబ్బంది మానవత్వం

- పాముకాటుకు గురైన గర్భిణిని సకాలంలో ఆస్పత్రికి తరలింపు
- ప్రైవేట్ అంబులెన్సులో చిత్రకొండ తీసుకువెళ్లేందుకు ఆర్థికసాయం

సీలేరు: పాముకాటుకు గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిండు గర్భిణిని జెన్‌కో సీఎస్సార్ అంబులెన్సు సిబ్బంది సకాలంలో ఆస్పత్రికి తరలించేందుకు ఆర్థికసాయం అందించి మానవత్వం చాటుకున్నారు. ఆమె ప్రాణాన్ని కాపాడి పలువురికి మార్గదర్శకంగా నిలిచారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలావున్నాయి. సీలేరు సరిహద్దు ఒడిశా ప్రాంతంలోని గుంటవాడలో నిండు గర్భిణి వంతల నాగమ్మ (29) బుధవారం ఇంటి వద్ద నిద్రిస్తున్న సమయంలో పాము కాటుకు గురైంది. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి ఆటోలో తీసుకువచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం చింతపల్లి పంపిస్తామని వైద్యులు చెప్పారు. అయితే ఒడిశా రాష్ట్రం కావడంతో తెలుగు మాట్లాడడం రానందున నాగమ్మ కుటుంబసభ్యులు ఒడిశాలోని చిత్రకొండ ఆస్పత్రికి



పాము కాటుకు గురైన గర్భిణి నాగమ్మ

వెళ్తామని చెప్పడంతో జెన్‌కో సీఎస్ఆర్ అంబులెన్సులో అక్కడికి తరలించారు. నాగమ్మ పరిస్థితి విషమంగా ఉన్నందున మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి ప్రైవేట్ అంబులెన్సులో తీసుకువెళ్లాలని అక్కడి వైద్యులు సూచించారు. నాగమ్మ కుటుంబ సభ్యులు, బంధువులు పేదలు కావడంతో చిత్రకొండ ఆస్పత్రికి తరలించేందుకు జెన్‌కో సీఎస్సార్ అంబులెన్సు సిబ్బంది అవసరమైన ఆర్థిక సాయం అందించి ప్రైవేట్ అంబులెన్సును సమకూర్చారు. ఈ మేరకు సకాలంలో ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడిందని జెన్‌కో సీఎస్సార్ అంబులెన్సు సిబ్బంది తెలిపారు.

పూర్తిస్థాయిలో చాపరాయి అభివృద్ధి

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతాన్ని పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి చేస్తామని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ అన్నారు. డుంబ్రిగుడలో పర్యటించిన ఆయన ఆయన ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతాన్ని సందర్శించారు. పర్యాటక కేంద్రంగా ప్రత్యేకంగా అభివృద్ధి చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. చాపరాయిలో అభివృద్ధిపనులను త్వరితంగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. చాపరాయి జలపాతం వద్ద యువతకు ఉపాధి కల్పించాలని కోరుతూ బుధవారం వైఎస్సార్‌సీపీ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి గోపాల్ వినతి పత్రం అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ ముజిబ్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు కావాలి

డీపీవో కొండలరావు

రంపచోడవరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో అందరూ భాగస్వాములు కావాలని డీపీవో కొండలరావు కోరారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం సచివాలయ సిబ్బంది వలంటీర్లతో పర్యావరణ సహిత జీవనశైలిపై సర్పంచ్ మంగా బొజ్జయ్య అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగులో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. తడి, పొడి చెత్త సేకరణపై వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై కూడా వెల్ఫేర్ అసిస్టెంట్లు ద్వారా మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. వివాహ రిజిస్ట్రేషన్ నమోదు చేసి, ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని, జనన మరణ ధ్రువీకరణ



మాట్లాడుతున్న డీపీవో కొండలరావు, వేదికపై సర్పంచ్ బొజ్జయ్య

పత్రాలు లేనివారికి లేటు నమోదు చేయించాలని ఆయన సూచించారు. సర్పంచ్ మాట్లాడుతూ విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం వల్ల పరిసరాలు కాలుష్యంతో నిండిపోతున్నాయన్నారు. డీఎల్పీవో రాఘవన్, పంచాయతీ కార్యదర్శి ఎన్.రమేష్ పాల్గొన్నారు.

అందుబాటులో ఆర్థోపెడిక్ సేవలు

- సర్జన్‌ను నియమించిన ప్రభుత్వం
- రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో రోగులకు తప్పిన ‘రిఫర్’ సమస్య

రంపచోడవరం: స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ ఆర్థోపెడిక్ సర్జన్ సుధాకర్‌ను ప్రభుత్వం ఆరునెలల క్రితం నియమించింది. దీంతో అప్పటినుంచి సేవలు అందుతున్నాయి. గతంలో ఇక్కడ సర్జన్ లేకపోవడంతో ఆర్థోపెడిక్ కేసులను రాజమహేంద్రవరం, కాకినాడ ప్రభుత్వాస్పత్రులకు రిఫర్ చేసేవారు. ఇప్పుడు ఎలాంటి కేసులైనా రిఫర్ చేయకుండా సుధాకర్ సేవలు అందిస్తున్నారు. చింతూరుకు చెందిన చంద్రశేఖర్ అనే యువకుడు రెండేళ్ల క్రితం ప్రమాదంలో కాలు విరిగిపోవడంతో భద్రాచలంలో శస్త్రచికిత్స చేయించుకున్నారు. అయితే కాలు లోపల రాడ్ విరిగిపోవడంతో పరిస్థితి విషమించింది. ఇన్‌ఫెక్షన్ కారణంగా నడవలేని పరిస్థితిలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. దీంతో వెంటనే అతనికి మంగళవారం శస్త్రచికిత్స చేశారు. విరిగి



రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో కోలుకుంటున్న రోగి చంద్రశేఖర్


పోయిన రాడ్‌ను తొలగించి వేరే ఎముకను ప్లేట్‌తో అమర్చారు. ఈ సందర్భంగా సర్జన్ సుధాకర్ మాట్లాడుతూ ఆర్థోపెడిక్ కేసులకు సంబంధించి పూర్తిస్థాయిలో ఇక్కడ అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పుడు రిఫర్ చేసే పరిస్థితి లేదన్నారు. ఆర్థోపెడిక్ సేవల కోసం ఏరియా ఆస్పత్రిలో తమను సంప్రదించాలని ఆయన కోరారు.

డోలీ మోతలు లేకుండా ఏజెన్సీలో రోడ్ల నిర్మాణం

- ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టాలి
- స్థాయీ సంఘం సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట (విశాఖ దక్షిణ): ఏజెన్సీ ప్రాంతంలో డోలి మోతలు ఉన్న గ్రామాలకు వెళ్లి రహదారుల కోసం సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర ఆదేశించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన పలు స్థాయీ సంఘాల సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ డోలి మోతలు లేకుండా అన్ని గ్రామాలకు ఉపాధి హామీ పథకం కింద రహదారులు నిర్మించాలన్నారు. ఈ మేరకు మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి తీర్మానాలు చేపట్టాలన్నారు. ప్రతిపాదనలకు నిధులు మంజూరు చేసి, పనులు పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అల్లూరి జిల్లాకు 13,005 ఇళ్లు మంజూరయ్యాయని గృహ నిర్మాణ సంస్థ జిల్లా మేనేజర్ చెప్పగా.. త్వరితగతిన పూర్తి చేయాలని చైరపర్సన్ కోరారు. ఇంకా అర్హులు ఉంటే ఇళ్లు మంజూరు చేయాలని సూచించారు. దోమల వల్ల వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని పలువురు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. తాను నివాసం ఉంటున్న డాక్టర్స్ కాలనీలో కూడా దోమలు బెడద ఉందని జెడ్పీ సీఈవో శ్రీరామ్మూర్తి అన్నారు. దీనిపై స్పందించిన మలేరియా అధికారి మణి దోమల





స్థాయీ సంఘ సమావేశానికి హాజరైన సభ్యులు, వివిధ శాఖల అధికారులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుభద్ర, చిత్రంలో సీఈవో శ్రీరామ్మూర్తి

నివారణకు తీసుకుంటున్న పలు చర్యలను వివరించారు.

కేజీహెచ్‌లో రక్త నిల్వలు లేవా?

కేజీహెచ్‌లో గిరిజన రోగులు రక్తం కోసం సంప్రదిస్తే.. డోనర్‌ను తీసుకురావాలని చెబుతున్నారని, మన్యంలో ఉండే గిరిజనులను తీసుకురావడం సాధ్యమేనా అని సుభద్ర ప్రశ్నించారు. దీనిపై కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ వేసవి కారణంగా రక్తం నిల్వలు తక్కువగా ఉన్నాయని, అత్యవసర కేసులకు మాత్రమే రక్తం సరఫరా చేస్తున్నామని చెప్పారు. పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ గణపతి తెలిపారు. చిన్నగుమ్ములూరులో ఉపాధి హామీ పనులు చేస్తున్న ప్రాంతంలో కూలీల సౌకర్యార్థం టెంట్, మంచినీరు, పరికరాలు లేవని రాయవరం జెడ్పీటీసీ సభ్యుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం డబ్బులు కూడా ప్రతి వారం విడుదల చేయడం లేదని అనంతగిరి జెడ్పీటీసీ సభ్యుడు తెలిపారు. 15 రోజులకు ఒకసారి డబ్బులు వేస్తున్నట్టు జిల్లా ఉపాధి హామీ పథకం అధికారి తెలిపారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించాలని చైర్‌పర్సన్ సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కాటేజీల నిర్మాణం వేగవంతం

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశం



ఇంటీరియర్ పనులను పరిశీలిస్తున్న పీవో

అరకులోయ రూరల్: కాటేజీల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని పద్మాపురం గార్డెన్‌ను సందర్శించారు. ఇక్కడ నిర్మిస్తున్న ట్రీ హట్స్, హెచ్ఎన్‌టీసీ పనులను ఆయన పరిశీలించారు. కాటేజీల వద్ద గార్డెన్‌ను అలంకరణ మొక్కలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని పద్మాపురం గార్డెన్ మేనేజర్ బొంజుబాబు, గిరిజన మ్యూజియం మేనేజర్ మురళిని ఆదేశించారు. ట్రైబల్ వెల్ఫేర్ జేఈ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత తప్పనిసరి

- ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

హుకుంపేట: నాడు–నేడు పథకంలో నిర్మిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి ఆదేశించారు. బుధవారం ఆమె మండలంలోని అడపరాయి, మారేల, పనసపుట్టు, సోడా గ్రామల్లో నాడు–నేడు పథకంలో నిర్మిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల భవనాల పరిధిలో ఉన్న మహిళా పోలీసులు వారానికి ఒకరోజు పర్యవేక్షించి ఫొటోలు అప్‌లోడ్ చేయాలని ఆమె సూచించారు. సీడీపీవో బాలచంద్రమణిదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

జెన్‌కో ఈఈకి సత్కారం



బాబూరావును సత్కరిస్తున్న జెన్‌కో ఈఈ శ్రీధర్

మోతుగూడెం: లోయర్ సీలేరు ప్రాజెక్టులో మోతుగూడెం ఈఈ బాబూరావుకు పదోన్నతి లభించిన సందర్భంగా బుధవారం ఆయనను చీఫ్ ఇంజినీర్ శ్రీధర్ ఘనంగా సత్కరించారు. బాబూరావు పోలవరం ప్రాజెక్ట్ ఎస్ఈగా పదోన్నతిపై నియమితులైన సందర్భంగా సీఈ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈఈ బాలకృష్ణ, ఏడీఈలు, ఏఈలు సిబ్బంది పాల్గొన్నారు.

ఐరిస్ విధానంలో రేషన్ పంపిణీ

- రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్



ఐరిష్ డీవైస్‌ను పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: రేషన్‌ను ఇకనుంచి ఐరిస్ విధానంలో పంపిణీ చేయాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ సూచించారు. రంపచోడవరంలో బుధవారం ఆయన ఎండీయూ వాహనదారులకు ఐరిష్ డివైస్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికి నిత్యావసర వస్తువులు ప్రతి నెలా ఒకటి నుంచి 17వ తేదీ వరకు అందజేయాలని ఆదేశించారు.

స్వయం ఉపాధికి దరఖాస్తుల ఆహ్వానం

- దరఖాస్తుకు 12 వరకు గడువు
- 13న ఇంటర్వ్యూలు

కొయ్యూరు: స్వయం ఉపాధి పొందేందుకు వీలుగా ప్రధానమంత్రి ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామసచివాలయం పరిధిలో ఐదుగురు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో మేరీరోజ్ తెలిపారు. దరఖాస్తుకు ఈనెల 12 వరకు గడువు ఉందన్నారు. ఆధార్, రేషన్ కార్డులు, బ్యాంకు ఖాతా వివరాలు, విద్యార్హత ధ్రువపత్రాలతో దరఖాస్తుదారులు ఈనెల 13న జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆమె కోరారు. ఎంపిక చేసుకున్న యూనిట్ల స్థాయిని బట్టి రూ.10 లక్షల వరకు రుణం పొందవచ్చన్నారు. రూ.లక్షకు రూ.30 వేలు సబ్సిడీ ఉంటుందన్నారు. కొందరు యూనిట్లు లేకుండా పొందే ఆలోచనలో ఉంటారని, అలాంటి వారికి రుణాలు ఇవ్వమని ఆమె స్పష్టం చేశారు. రుణాలు దరఖాస్తు చేసేవారు తప్పనిసరిగా సర్పంచ్‌తో సంతకాలు చేయించి అందజేయాలని సూచించారు. వెలుగు ఏపీఎంతో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో తెలిపారు.

మత్తు కోసం జీవితకాలాన్ని తగ్గించుకోవద్దు



యోగా తరగతిలో పాల్గొన్న పోలీస్ అధికారులు, సిబ్బంది

దొండపర్తి(విశాఖ దక్షిణ): వరల్డ్ నో టొబాకో డే సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ ఆదేశాల మేరకు బుధవారం సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బందికి యోగా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు కోసం ఎంతో విలువైన జీవితకాలాన్ని తగ్గించుకుంటున్నారని, పొగాకుకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే సిబ్బంది ఒత్తిడికి గురికాకుండా విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు మెలకువలను తెలియజేశారు. పని ఒత్తిడి నుంచి వెంటనే బయటపడి మనస్సును ప్రశాంతంగా ఉంచుకొనే మార్గాలను, అలాగే సిబ్బందికి మనోధైర్యం పెంపొందే పలు మార్గాలను వివరించారు. పాజిటివ్ థింకింగ్ కలిగి ఉండాలని, రోజులో కొంత సమయం ధ్యానం చేయడానికి కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీ(ఏఆర్) కె.సుబ్రహ్మణ్యం, ఏసీపీ(ఏఆర్) ఆర్.పి.ఎల్.శాంతికుమార్, ఆర్ఐలు రాఘవేంద్ర, టి.భగవాన్, సిబ్బంది పాల్గొన్నారు.

గంగవరం పోర్టు ఉద్యోగులకు మెరుగైన ఇంక్రిమెంట్

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు ఉద్యోగులకు 14 సంవత్సరాల్లో మొదటిసారిగా గతంలో కంటే మెరుగ్గా 100 శాతం వార్షిక ఇంక్రిమెంట్లు అందజేసినట్లు ఏజీపీఎల్ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. అదానీ గంగవరం పోర్ట్ లిమిటెడ్ తన వాటాదారుల సంక్షేమం, భద్రత వృద్ధికి విలువనిస్తోందని పేర్కొన్నారు. మొదటి బ్యాచ్‌కు చెందిన 63 మంది ఉద్యోగుల కోసం శిక్షణ, వివిధ ఉద్యోగాలకు రిఫిట్‌మెంట్‌తో సహా ఓ అప్‌స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

పడి లేచిన కెరటం..
‘విజయ’తీరాలకు..

- విధికి ఎదురొడ్డి పోరాడిన వనిత గాథ

విధిని ఎదిరించి ‘విజయ’తీరాలకు చేరిన వనిత గాథ ఇది. ‘ముదితలు నేర్వగరాని విద్య గలదే’ అని పోతన అన్నట్లుగా లక్ష్యం బలంగా ఉంటే ఎన్ని అవాంతరాలు వచ్చినా అధిగమించవచ్చని చాటి చెప్పిన మహిళ కదనం ఇది. ‘అలలు ఎగిసి పడినందుకు కాదు. పడి లేవడం నాకిష్టం’ అన్న విధంగా ప్రతి ఒక్కరూ తాము పడిపోయాం అనుకోకుండా రెట్టించిన శక్తితో పైకి లేవగలమని చేతల్లో చూపిన ధీశాలి ఆమె. విజయవాడ రాజ్‌భవన్‌లో ఉద్యోగిగా ఉంటూ పీహెచ్‌డీ పట్టా పొందిన విజయగౌరి జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకం.

– విజయవాడసెంట్రల్

విషాదం నుంచి మొదలై..

కళ్లెదుటే భర్త, కన్నకూతురు, తోడబుట్టిన తమ్ముడు చనిపోతే.. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కొడుకు అచేతనంగా పడి ఉంటే.. ఎవరైనా ఏం చేస్తారు? జీవితాంతం ఆ విషాద ఘటనను గుర్తు చేసుకుని జీవచ్ఛవంలా మారిపోతారు. గుండెల్ని పిండేసే ఆ ఘటన తలచుకుంటేనే హృదయం ద్రవించిపోతోంది. మరి కళ్లారా చూసి ఆ బాధను భరించాలంటే ఆ బాధ వర్ణనాతీతం. కానీ సరిగ్గా అటువంటి విషాద సంఘటనే ఆమె జీవితంలో చోటు చేసుకుంది. కానీ అందరిలా విధి రాత, తలరాత అనుకుంటూ ఆమె కుమిలిపోతూ కూర్చోలేదు. బతికి ఉన్న కొడుకులో భర్త, కూతురు, తమ్ముడిని చూసుకుంటూ జీవిత ప్రయాణాన్ని ప్రారంభించింది. తండ్రి ఇచ్చిన మనోధైర్యంతో విజయతీరాలకు చేరింది విజయగౌరి. బాధను దిగి మింగి ఓ వైపు ఉద్యోగం చేస్తూనే మరో వైపు ఉన్నత చదువులు చదివి పీహెచ్‌డీ పూర్తి చేసింది. ప్రస్తుతం రాజ్‌భవన్‌లో ఉద్యోగం చేస్తూ అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఆమె జీవన పోరాటాన్ని ఆమె మాటల్లోనే విందాం..

కుటుంబ నేపథ్యం..

‘మాది విశాఖపట్నం గాజువాక. నాన్న కృష్ణారావు డాక్ యార్డ్‌లో ఉద్యోగి. అమ్మ లక్ష్మీ గృహిణి, కుటుంబ, ఆర్థిక కట్టుబాట్ల కారణంగా ఇంటర్ పూర్తి కాగానే పెళ్లి చేశారు. 1992లో సూర్యప్రకాష్‌తో వివాహమైంది. భర్త ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు. ఇద్దరు పిల్లలు జీవితం హాయిగా సాగిపోతోంది. చదువుపై ఉన్న శ్రద్ధతో ఆయన సహకారంతో 2000లో దూరవిద్యలో ఆంధ్ర యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేశాను. 2002లో హిందీ బీఈడీలో సీటు వచ్చినప్పటికీ వదులుకోవాల్సి వచ్చింది. ఎంఏ (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్) పూర్తి చేశాను. హాయిగా సాగిపోతున్న జీవితంలో ఒక్కసారిగా విషాదం. సంక్రాంతి పండుగ వేళ 2003 జనవరి 16న జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త, కూతురు, తమ్ముడు చనిపోయారు. నేను, ఆరేళ్ల మా బాబు కోమాలోకి వెళ్లాం. అయితే మా అత్తింటి వారు నా భర్త, పాప మృతదేహాలు మా పుట్టింటి వద్దే వదిలివెళ్లిపోయారు. అప్పటి నుంచి మా పుట్టింట్లోనే అమ్మా నాన్న వద్దే ఉంటున్నాను.



డాక్టరేట్ సాధించిన విజయగౌరిని అభినందిస్తున్న రాజ్ భవన్ సిబ్బంది

2004లో కారుణ్య నియామకం..

నా భర్త ఉపాధ్యాయుడు కావడంతో కారుణ్య నియామకాల్లో 2004 ఏప్రిల్ 3న సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఉద్యోగం వచ్చింది. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం చినరావు పల్లి గ్రామంలో పోస్టింగ్. అయితే జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం కంటే సెకండరీ గ్రేడ్ టీచర్ ఉద్యోగానికి జీతం ఎక్కువ కావడం, కారుణ్య నియామకం కింద టీచర్‌గా పోస్టింగ్ ఇవ్వడం సరికాదని, దీనికి సంబంధించి సెప్టెంబర్ 2002 ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయని, తెలుసుకోకుండా పోస్టింగ్ ఇచ్చారని సరెండర్ చేశారు. దీంతో మళ్లీ ఒంటరి పోరాటం ప్రారంభం అయ్యింది. పిల్లాడి చదువు, ఇంటిపోషణ చూసుకుంటూ జీవనం సాగిస్తుండగా.. నవంబర్, 2005లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇచ్చారు. నాన్న ఇచ్చిన ధైర్యంతో ఉద్యోగం చేస్తూనే పట్టు వదలకుండా చదువు కొనసాగించాను. పీహెచ్‌డీ చేయాలనే అభిరుచి, గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఇంగ్లిషు అభివృద్ధి చేసి సేవ చేయాలనే ఆలోచనతో ఎంఏ ఇంగ్లిష్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాను. ఆ తర్వాత కృష్ణా యూనివర్సిటీలో పీహెచ్‌డీ జాయిన్ అయ్యాను. 2023 మార్చి 29న డాక్టరేట్ పొందాను.



ప్రోత్సాహించిన వారెందరో..

నా జీవిత ప్రయాణంలో విజయనగరం నుంచి రాజ్‌భవన్ వరకు ఎందరో వెన్నుతట్టి ప్రోత్సహించారు. ప్రత్యేకంగా నన్ను ప్రోత్సహించిన డాక్టర్ ఎస్.అప్పారావు, డాక్టర్ మోహన్ రావు, సీహెచ్ ప్రసాదరావు, ఎం. కోటేశ్వరరావుకు ధన్యవాదాలు. నా కొడుకు శశిధర్ ఎన్ఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేసి సివిల్స్ ప్రిపేర్ అవుతున్నాడు. వెన్నుతట్టి ప్రోత్సహించిన నాన్నకు డాక్టరేట్ అంకితమిస్తున్నా.

నాన్న ఇచ్చిన ధైర్యంతో..

ఒంటరిగా ఉంటే పిచ్చిదానివి అయిపోతావు. నీ కొడుకు కోసమైనా నీవు అన్నీ మరిచిపోయి బతికి ఉండాలి. మామూలు మనిషివి కావాలంటూ నాన్న వెన్నుతట్టారు. గుండె ధైర్యం నింపారు. మళ్లీ చదువు బాట పట్టించారు. 2003లో గురజాడ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, శ్రీకాకుళంలో బీఎడ్ జాయిన్ చేశారు. ఇక ప్రతిరోజు తెల్లవారు జామున నాలుగంటలకు నిద్ర లేచి బస్సులో గాజువాక నుంచి శ్రీకాకుళం జిల్లా పెదపాడు గ్రామం వెళ్లడం.. రావడం. ఇంటికి రాగానే ఒంటిరిగా బిక్కుబిక్కుమంటూ ఎదురు చూస్తున్న కొడుకు. ఓ వైపు పిల్లాడికి చదువు చెప్పుకుంటూ నేను చదువుకుంటూ బీఎడ్ డిస్టింక్షన్‌లో పాసయ్యాను.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి తదితరులు

అడ్డతీగల: అడ్డతీగల మండలం ఎల్లవరంలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో రాజవొమ్మంగి మండలం కొండపల్లి పంచాయతీలోని వివిధ గ్రామాలకు చెందిన సీపీఎం పార్టీకి చెందిన 20 కుటుంబాలు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. రాజవొమ్మంగి పార్టీ కన్వీనర్ సింగిరెడ్డి రామకృష్ణ, మండల కో-ఆప్షన్ సభ్యులు అడపా కామేష్, చెరుకుంపాలెం, మొల్లేరు సర్పంచ్‌లు దాసరి నాగు, సర్పంచ్ లక్ష్మి పాల్గొన్నారు.

ముగ్గురు గంజాయి నిందితులు అరెస్ట్



అరెస్టయిన నిందితులతో ఎస్ఐ సంతోష్

అరకులోయ రూరల్ : గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు అరకులోయ ఎస్ఐ సంతోష్ బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు. గెమ్మెలి రమేష్(జీకే వీధి), లక్ష్మణ్(డుంబ్రిగుడ)ల వద్ద చిత్తూరు జిల్లాకు చెందిన శామ్యూల్ అనే వ్యక్తి 5 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. యండపల్లివలస గ్రామంలో ఈ నెల 30న గంగమ్మతల్లి జాతర జరగడంతో ఎవరికీ అనుమానం రాదని, ఆ రోజు రాత్రి బ్యాగుల్లో గంజాయి పెట్టుకుని మైదాన ప్రాంతాలకు తరలించేందుకు రైల్వే స్టేషన్ సమీపంలో ఉండగా పట్టుకున్నట్టు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్టు వెల్లడించారు.

లాడ్జీలో తనిఖీలు

- పోలీసుల అదుపులో ఆరుగురు
- ఒకరి వద్ద పిస్టల్ స్వాధీనం

సీతమ్మధార: మహారాష్ట్రకు చెందిన ఆరుగురిని ఫోర్త్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరంతా రైల్వే న్యూకాలనీలోని ఓ లాడ్జీలో దిగారు. ఎస్ఐ వెంకటరావు మంగళవారం రాత్రి లాడ్జీలో సాధారణ తనిఖీలు చేపట్టారు. ఇందులో నలుగురు ఒడిశాలోని పూరి జగన్నాథస్వామిని దర్శించుకోవడానికి వెళ్తున్నట్లు చెప్పారు. మరో ఇద్దరు కూడా అక్కడికే వెళ్తున్నామని చెప్పినప్పటికీ.. అనుమానం వచ్చి బ్యాగులు తనిఖీ చేపట్టారు. ఒకరి బ్యాగులో పిస్టల్ ఉన్నట్లు గుర్తించి విచారణ చేపట్టారు. ఒడిశాలో ఒకరు పిస్టల్‌ను ఆర్డర్ చేసినట్లు వారు పోలీసులకు తెలిపారు. ఆర్డర్ కాపీపై ఆరా తీయగా.. వారి వద్ద లేకపోవడంతో ఆరుగురిని స్టేషన్‌కు తరలించారు. అక్కడ డీసీపీ(క్రైం) నాగన్న వీరిని విచారించారు. పిస్టల్ ఎక్కడ కొనుగోలు చేశారన్న వివరాల సేకరణకు ఓ బృందం మహారాష్ట్ర వెళ్లింది.

వైభవంగా వెంకన్న కల్యాణోత్సవం

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో 13వ వార్షిక తిరు కల్యాణోత్సవాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. విశాఖకు చెందిన బంకుపల్లి ఉమాప్రసాద్ శర్మ నేతృత్వంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆరవల్లి సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కల్యాణోత్సవంలో నలుగురు దంపతులు పాల్గొన్నారు. గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

చింతపల్లిరూరల్: ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని పెద్దబరడ, అన్నవరం, చిన్నగడ్డలో రైతు భరోసా కేంద్రంలో బుధవారం విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. రైతులు విత్తనాలు, ఎరువుల కోసం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తోందన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. విత్తనాలు కావల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు తీసుకొచ్చి ఆర్బీకేల్లో అందజేస్తున్న విత్తనాలు పొందవచ్చన్నారు. ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత, పెదబరడ సర్పంచ్ సమిడి గోపాల్, ఎంపీటీసీ సభ్యులు దారలక్ష్మి, లోవరాజు, కార్యదర్శులు పూర్ణచంద్రరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భారీగా గంజాయి పట్టివేత

పుష్ప సినిమా చూసి గంజాయి స్మగ్లర్లు తమ తెలివిని పెంచుకున్నారు. అయితే అదే సినిమా పోలీసులు కూడా చూసుంటారన్న విషయాన్ని మర్చిపోయినట్టున్నారు. దీంతో అడ్డంగా పోలీసులకు చిక్కి, ఇపుడు ఊచలు లెక్కిస్తున్నారు.

- లబ్బూరు వద్ద 310కిలోల గంజాయి స్వాధీనం
- ముగ్గురు ఒడిశా గంజాయి స్మగ్లర్లకు రిమాండ్
- పట్టుకున్న గంజాయి విలువ రూ.6.20 లక్షలు

ముంచంగిపుట్టు : ముంచంగిపుట్టు మండలం జోలాపుట్టు పంచాయితీ లబ్బూరు జంక్షన్ వద్ద అక్రమంగా ఒడిశాకు తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురు గంజాయి స్మగ్లర్లను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. గంజాయి ప్యాకెట్లు, గంజాయి అక్రమ రవాణాకు ఉపయోగించిన బొలెరో వ్యాన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్ఐ కె.రవీంద్ర తెలిపిన వివరాలు. గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నారన్న పక్కా సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదించారు. వారి ఆదేశాలతో లబ్బూరు జంక్షన్ వద్ద బుధవారం ఉదయం స్థానిక ఎస్ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా నుంచి లబ్బూరు జంక్షన్ మీదుగా ఒడిశా కొర్రాపుట్టు వెళ్తున్న బొలెరో పికప్ వ్యాన్‌ను తనిఖీ చేశారు. దీంతో పుష్ప సినిమా మాదిరిగా పికప్ వ్యాన్ కింద భాగంలో గంజాయి ప్యాకెట్లు ఉండడాన్ని గుర్తించారు. గంజాయిని 2 కేజీల చొప్పున ప్యాకింగ్ చేసిన 155 ప్యాకెట్లును, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులతోపాటు గంజాయి ప్యాకెట్లను, బొలెరో పికప్ వ్యాన్‌ను సీజ్ చేసి ముంచంగిపుట్టు పోలీసు స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన గంజాయి 310 కిలోలు ఉందని, దీని విలువ 6 లక్షల 20వేల రూపాయలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు. పట్టుబడినవారిలో ఒడిశా రాష్ట్రం కొర్రాపుట్టు జిల్లా నందపూర్ బ్లాక్ బిల్లాపుట్టు పంచాయతీ గోడిపుట్టు గ్రామానికి చెందిన అజయ్ తంగి, జలపుట్టు పంచాయతీ కేంద్రానికి చెందిన రమేష్‌కుమార్ బెనియా, లంతాపుట్టు బ్లాక్ గొడిహంజర్ పంచాయతీ అమలపుట్టు గ్రామానికి చెందిన సుభాష్ సీసాలుగా గుర్తించినట్టు పేర్కొన్నారు. ముగ్గురు గంజాయి స్మగ్లర్లు ఒడిశాకు చెందినవారేనని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. ఈ తనిఖీలో ఏఎస్ఐ తిరుపతిరావు, ముంచంగిపుట్టు పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి సమస్యలు : ఎంపీపీ

రంపచోడవరం: రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలను మెరుగుపరచాలని కోరుతూ కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను బుధవారం ఎంపీపీ బందం శ్రీదేవి కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సుమిత్ కుమార్ ఆస్పత్రి ఆవరణలో మంచినీటి సౌకర్యం కోసం రూ. 10 లక్షలు మంజూరు చేశారు. ఆస్పత్రిలో వైద్య సేవల నిర్లక్ష్యంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఆస్పత్రి సూపరిండెంట్‌తో సహా వైద్యులను ఐటీడీఏకు పిలిపించి మాట్లాడారు. ఇకపై వైద్య సేవల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించినట్టు ఎంపీపీ తెలిపారు. అలాగే ఆసుపత్రిని తరుచూ సందర్శించి సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఏజెన్సీలో జీడిమామిడి పంటకు కనీస మద్దతు ధర ప్రకటించాలని కోరారు. దీనిపై కలెక్టర్ ఉద్యానవన, వ్యవసాయశాఖ అధికారులతో చర్చించి కమిటీ ఏర్పాటు చేశారు. జీడిమామిడి ధరలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. రైతులకు గిట్టుబాటు, తూకాల్లో మోసాలపై సమన్వయ అధికారిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పందిరిమామిడి -చవిటిదిబ్బలు రహదారి నిర్మాణం నిలిచిపోవడంపై కలెక్టర్ మాట్లాడుతూ ఈ విషయంపై అటవీ అధికారులతో చర్చించామని, అటవీ అభ్యంతరాలు తొలిగిపోయినట్టుతెలిపారు. త్వరలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. మండలంలో వివిధ బీటీ, సీసీ, గ్రావెల్ రహదారులు కోసం ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో అంచనాలు తయారు చేసి పనులు ప్రారంభించనున్నట్టు తెలిపారు. వీటిపై ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరేతో చర్చించారు. ఎంపీపీ వెంట ఎంపీటీసీ సభ్యులు తుర్రం వెంకటేశ్వర్లుదొర, వంశీ కుంజంలు ఉన్నారు.

సేవా శౌర్యానికి సాహో

- ఘనంగా నేవల్ ఇన్వెస్టిచర్ వేడుకలు
- ఇద్దరు నౌకాదళాధికారులకు శౌర్య పతకాలు
- వేడుకగా పతకాల ప్రదానం
- నేవల్ డాక్‌యార్డుకు బెస్ట్ గ్రీన్ ప్రాక్టీస్–2023 అవార్డు

సాక్షి, విశాఖపట్నం :

2021.. సెప్టెంబర్ 26.. ఉదయం 8 గంటలు..



జమ్మూకాశ్మీర్‌లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న 14 రాష్ట్రీయ రైఫిల్ బెటాలియన్ సెక్టార్-3లోని ఒక ఇంట్లో ఉగ్రవాదులున్నట్లు గుర్తించారు. వెంటనే మార్కోస్ బృందానికి సమాచారం అందించారు. వినీత్‌కుమార్‌తో సహా మార్కోస్ బృందం ఉగ్రవాదులున్న ఇంటి వద్దకు చేరుకుంది. ఖాన్ మొహల్లా, వాత్రినా అనే ఇద్దరు ఉగ్రవాదులున్న ఇంటికి ఎదురుగా ఉన్న ఇల్లుని మార్కోస్ బృందం ఆక్రమించింది. ఉగ్రవాదులు నేరుగా కాల్పులు జరిపేందుకు వీలుగా ఉన్న ఇంటి పైకప్పుపైకి ప్రమాదం అని తెలిసినా.. టెర్రరిస్టుల్ని మట్టుపెట్టడమే లక్ష్యంగా వినీత్‌కుమార్, మనీష్ చౌహాన్ పైకి వెళ్లారు. 9.30 గంటల సమయంలో టెర్రరిస్టులు గ్రానైడ్‌తో దాడి చేయడంతో పాటు ఏకకాలంలో ఫైరింగ్ చేశారు. ఈ క్రమంలో రైఫిల్‌మ్యాన్ మనీష్ చౌహాన్‌కు గాయాలయ్యాయి. గ్రానైడ్ పేలుడుతో వచ్చిన అగ్ని కీలల నుంచి తప్పించుకున్న వినీత్‌కుమార్.. ఉగ్రవాదుల్ని ట్రాక్ చేస్తూ.. వారున్న ఇంటిపైకి దూసుకెళ్లారు. ఫైరింగ్ తర్వాత రెండు గంటల పాటు మౌనంగా ఉన్న టెర్రరిస్టులు మరోసారి దాడికి ప్రయత్నించారు. ఈలోపునే.. వారిని ట్రాక్ చేసుకున్న వినీత్‌కుమార్.. ప్రాణాలకు తెగించి.. ఉగ్రవాదులపై కాల్పులు జరిపి మట్టుబెట్టారు. ఉగ్రమూకల నుంచి దేశాన్ని రక్షించేందుకు ధైర్య సాహసాల్ని ప్రదర్శించిన వినీత్‌కుమార్‌కు అత్యుత్తమమైన శౌర్య పతకం(గ్యాలంట్రీ మెడల్) వరించింది.

2020 నవంబర్ 26..



గోవా సాగరజలాల్లో ఐఎన్ఎస్ విక్రమాదిత్య నుంచి.. రయ్‌మంటూ గాల్లోకి మిగ్-29కి చెందిన మిగ్ 677 యుద్ధ విమానం దూసుకెళ్లింది. కొత్తగా నౌకాదళంలో చేరిన వారికి యుద్ధ విమానాలు నడిపే అంశంపై శిక్షణలో భాగంగా.. మిగ్ 677 విమానాన్ని అత్యంత అనుభవజ్ఞుడైన కమాండర్ నిశాంత్ సింగ్ నడుపుతూ కోపైలట్‌కు శిక్షణ అందిస్తున్నారు. 1500 గంటలకు పైగా.. మిగ్ విమానాల్ని నడిపిన అనుభవం ఉన్న నిశాంత్.. శిక్షణ అందిస్తున్న సమయంలో సాయంత్రం 4.27 గంటల సమయంలో మిగ్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. ఒక్కసారిగా తలెత్తిన ఈ హఠాత్పరిణామం నుంచి తప్పించుకునేందుకు నిశాంత్ తన శాయశక్తులా ప్రయత్నించారు. 15 వేల అడుగుల ఎత్తు నుంచి అసాధారణ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ.. కిందకి వస్తూ ఉన్నారు. దాదాపు 502 అడుగుల ఎత్తులో పరిస్థితులు చేజారిపోయినట్టు గుర్తించారు. వెంటనే ట్రైనీ పైలట్ ను విమానం నుంచి తప్పించేసిన నిశాంత్.. తన ప్రాణాల్ని మాత్రం కాపాడుకోలేక దేశం కోసం తుదిశ్వాస విడిచారు. అందుకే నిశాంత్‌కు శౌర్య పతకం వరించింది.

ఇలా ఒక్కొక్కరిదీ.. ఒక్కో విజయగాథ..

శత్రుదేశాల నుంచి దేశాన్ని రక్షిస్తూ.. పౌరులు జీవితాలు ప్రశాంతంగా సాగేందుకు శ్రమిస్తున్న నౌకాదళ అధికారులు, సిబ్బంది ధైర్య సాహసాలకు గుర్తింపుగా అత్యుత్తమ సేవా పతకాలతో ఇండియన్ నేవీ సత్కరించింది. 33 మందికి శౌర్య, నవ్‌సేనా, విశిష్ట సేవా, కెప్టెన్ రవిధీర్ మెమోరియల్, లెఫ్టినెంట వీకే జైన్ మెమోరియల్ గోల్డ్ మెడల్స్, జీవన్ రక్షా పదక్ అవార్డులను భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ ఆర్.హరికుమార్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రమైన విశాఖలో నేవల్ ఇన్వెస్టిచర్ సెరమనీ -2023ని బుధవారం ఘనంగా నిర్వహించారు. నౌకాదళాధికారులు, సెయిలర్స్, యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్ల సారథులు, నేవీ కుటుంబాల సమక్షంలో పతకాల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ హితంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ నౌకల నిర్వహణ సాగిస్తున్న విశాఖలోని నేవల్ డాక్‌యార్డు... బెస్ట్ గ్రీన్ ప్రాక్టీస్-2023 ఇండస్ట్రియల్ విభాగంలో సీఎన్ఎస్ ట్రోఫీని దక్కించుకుంది.

విశాఖ ప్రజలారా.. మిలాన్-2024కు సన్నద్ధమవుదాం..



ఇండియన్ నేవీలో తూర్పు నౌకాదళం కీలకంగా వ్యవహరిస్తోందని భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ ఆర్.హరికుమార్ అన్నారు. విశాఖ నగరంలో ఇప్పటికే ఐఎఫ్ఆర్, పీఎఫ్ఆర్‌తో పాటు, వివిధ దేశాలతో ద్వైపాక్షిక, బహుళ విన్యాసాలు విజయవంతంగా నిర్వహించామన్నారు. 2022లో విశాఖలో నిర్వహించిన మిలాన్‌తో ప్రపంచ దేశాలకు భారత రక్షణదళ సత్తాని చాటామన్నారు. ఇప్పుడు మరోసారి రికార్డు స్థాయిలో జరగనున్న మిలాన్‌కు విశాఖ ఆతిథ్యమిచ్చేందుకు సిద్ధమవుతోందని తెలిపారు. మిలాన్–2024 పేరుతో వచ్చే ఏడాది ఫిబ్రవరి 15న దాదాపు 50 దేశాలతో ఈ విన్యాసాల్ని ఈస్టర్న్ నేవల్ కమాండ్ ప్రధాన స్థావరంలో నిర్వహించనున్నామని.. నగర ప్రజలు సహకారంతో ఈ కార్యక్రమం కూడా విజయవంతంగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. వివిధ దేశాల మధ్య సహృద్భావ వాతావరణంలో స్నేహ పూర్వక సత్సంబంధాల్ని మెరుగు పరచుకోవడంతో పాటు శత్రుసైన్యానికి బలం, బలగం గురించి నిత్యం తెలియజేసేందుకు ఈ విన్యాసాలు నిర్వహించనున్నట్లు అడ్మిరల్ హరికుమార్ తెలిపారు.